# ఆధునిక నీతి కథలు



తాళ్లూరు నాగేశ్వరరావు

మున్సిపల్ ఛైర్మన్ చలపతిరావు కంటె ఆ నగరంలో ఆయన బావమర్ది భాస్కర్రావుకు పేరుప్రఖ్యాతులు పదింతలున్నాయంటే ఆ నగర వాస్తవ్యులకు ఏ మాత్రం అతిశయోక్తిగా కనిపించదు. కారణం మరేమీ లేదు— ఆ టవున్లో భాస్కర్రావు పలుకుబడి పెట్రోల్లాగా చెలామణి కావడమే.

ముప్పై అడుగుల వెడల్పుగల మెయిన్ బజార్లో పేవ్మెంట్ల మీద పళ్ల దుకాణాలు పెట్టుకోవడానికీ, రోడ్ల రిపేర్ల కాంట్రాక్టులు రావడానికీ, మున్సిపాలిటీ స్కూళ్లల్లో టీచర్ల బదిలీలకూ, ఇళ్ల పన్నుల తగ్గింపుకూ, ఖాళీ స్థలాల దురాక్రమణకూ, పన్నుల ఎగవేతకూ, చిల్లరమల్లర ఉద్యోగాల నియామకానికీ, లైసెన్సులు ఇవ్వడానికీ, రద్దుచేయడానికీ, ఎన్నో ఇతరత్రా అమాంబాపతు పనులకూ భాస్కర్రావు ఆమోదానికి అపరిమితమైన విలువ ఉంది. అతను అవునంటే పనులవుతాయి; కాదంటే పనులు కావు. ఆ నగరపు మున్సిపాలిటీలో మురుక్కాలవపై ఈగలూ, దోమలూ స్వైరవిహారం చేయడాని క్కూడా భాస్కర్రావు అనుమతి కావాలి మరి.

ఆ నగరానికి చలపతిరావు రెండుసార్లు ఛైర్మన్ అయ్యాడు. ఆ కాలంలో భాస్కర్రావు రెండు భవనాలు నిర్మించాడు. ఒకదాంట్లో వుంటున్నాడు; మరొకటి అద్దెకిచ్చాడు. రెండు ఎంబాసిడర్ కార్లు కొన్నాడు. ఒకటి సొంతానికి; మరొకటి బాడుగకు తిప్పటానికి. యాభై తులాల బంగారం కొని, కాకి ముక్కుకు దొండ పండు తగిలించినట్టుగా కొత్తగూడెం బొగ్గురంగులో వుండే భార్య మెడలో నగలు చేయించి తొడిగాడు. అయిదెకరాలు పొలం కొన్నాడు. ఓ మంత్రిగారి బావమర్ది భాగస్వామ్యంలో ఓ రిగ్గు కొని బద్వేల్ ప్రాంతంలో బిజినెస్ చేయిస్తున్నాడు. కోడిగుడ్ల నన్నింటినీ ఒక బుట్టలో పెడితే పగిలిపోవచ్చు. ఆ

సిద్ధాంతం ప్రాతిపదికపై భాస్కర్రావు తన వ్యాపారాన్ని బహుముఖంగా విస్తరింపజేశాడు. ఒకదాంట్లో నష్టంవచ్చినా మరోదాంట్లో వచ్చే లాభంతో క్షేమంగా ఉండొచ్చునని, ఏమైనా అతను ఏ వ్యాపారం చేసినా, ఏ వ్యవహారం చేపట్టినా గోతిలో పడలేదు.

ఆ నగరానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో నవాబు నబీసాహెబ్ తోటుంది. ఆ తోట మధ్యలో ఓ చిన్న గెస్టుహౌసుంది. ఆ గెస్టుహౌస్‌లో ఓ ఎయిర్‌కండిషన్డ్ గది వుంది. ఆ గదిలో అప్పుడప్పుడూ అర్ధరాత్రిదాకా మందు పార్టీలూ, మగువ పొందులూ జరుగుతూ వుంటాయి. వాటికి భాస్కర్రావు అప్పుడప్పుడూ హాజరవుతూ వుంటాడు. ఆ రోజు రాత్రి అలాంటి పార్టీకి వెళ్ళి గొంతుకు సెంటీమీటరు కిందిదాకా సీమసరుకు పట్టించి, కట్టుకున్న ఖద్దరు లాల్చీకి కోనసీమ కుర్రదాని కునేగా పరిమళం అంటుకొనేదాకా కులికి, ఆ పైన సొంతంగా డ్రైవ్‌చేసుకుంటూ ఇంటికి బయల్దేరాడు భాస్కర్రావు.

అర్ధరాత్రి దాటింది.

వీధుల్లో కుక్కలు మినహా మరే ప్రాణీ తిరగడంలేదు.

భాస్కర్రావులో నిషా నషాళంలో నాట్యంచేస్తూండగా, నేలా నీళ్ళా, మెరకా పల్లాం, గొయ్యీ గుట్టా ఒకే రకంగా కనబడసాగాయి.

రాములవారి గుడి మలుపులో ఆ సాయంత్రం మున్సిపాలిటీవారు ఒక వాటర్‌పైపును బాగుచేయడానికి తీసిన నిలువులోతు గొయ్యి సంగతి భాస్కర్రావు విస్కీమనస్సుకు గుర్తురాలేదు. నేరుగా కార్ను ఆ గోతిలోకి పోనిచ్చాడు. ముందుచక్రాలు గోతిలోకి దిగబడగా కారు వెనకచక్రాలు ఆరడుగుల ఎత్తున పైకి లేచాయి. డోర్ దానంతట అదే తెరుచుకోగా భాస్కర్రావు గోతిలో పక్కవాటుగా పల్టీగొట్టి పడ్డాడు.

*ఎవరు తీసుకొన్న గోతిలో వాళ్ళె పడకపోవచ్చు. కాని మున్సిపాలిటీవారు తీసిన గోతిలో పడక తప్పదు.*